క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు



వినాయకుని మండపం వద్ద కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

రాజాం సిటీ: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ గేటు సమీపంలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపం వద్ద మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ ఏడాది పంటలు బాగా పండాలని, అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని వేడుకున్నారు.

అన్నదానం



మల్లికార్జున కాలనీలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రాజాం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక పట్టణంలోని మల్లికార్జున కాలనీ, బాబానగర్, శ్రీకాకుళం రోడ్డు, పాలకొండ రోడ్డు తదితర ప్రాంతాల్లోని గణేశుని మండపాల వద్ద అన్నదాన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పట్టణ ప్రజలతో పాటు పట్టణ పరిసర గ్రామాలకు చెందిన వేలాదిమంది ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి అన్నప్రసాదం స్వీకరించారు. మల్లికార్జున కాలనీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు పాల్గొని, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం ఆయన ఇటువంటి కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని కోరారు.

మహాధర్నాను విజయవంతం చేయండి



ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు

రాజాం సిటీ: అంగన్‌వాడీల(అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు) సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 25వ తేదీన విజయవాడలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయండి అని ఏఐటీయూసీ జిల్లా నేత ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్, సీఐటీయూ నాయకురాలు బి.ఉమాకుమారి కోరారు. ఇదే విషయమై స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అందివ్వాలని, పెన్షన్, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరుతూ చేసే ఈ ధర్నాకు అందరూ తరలిరావాలన్నారు.


జల్‌జీవన్ మిషన్ పనులకు భూమిపూజ



జల్‌జీవన్ మిషన్ పనులకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ ఈశ్వరరావు

రాజాం సిటీ: ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యంగా మండలంలోని నందబలగ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో జల్‌జీవన్ మిషన్ పనులకు సర్పంచ్ కొర్ను ఈశ్వరరావు శుక్రవారం భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు ఇచ్చేందుకే ఈ పనులు చేపడుతున్నామన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బి. సూర్యనారాయణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్ నమోదు పరిశీలన



పారంపేట ఆర్‌బీకేలో ఈ–క్రాప్ నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: ప్రతీ రైతు తమ పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏవో జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలోని పారంపేట, ఉనుకూరు గ్రామాల రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతుల ఈ–క్రాప్ నమోదు వివరాలను శుక్రవారం పరిశీలించిన ఆయన ఈ–క్రాప్ బుకింగ్ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.

కౌలురైతుకు ఆర్థిక భరోసా



రాజాం సిటీ: పాగిరి ఏపీజీవీబీ బ్యాంకు అధికారితో మాట్లాడుతున్న ఏవో రేణుకాసాయి



వంగర: అరసాడ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏవో కన్నబాబు



రేగిడి: ఉంగరాడ ఏపీజీవీబీ మేనేజర్‌తో సమావేశమైన ఏవో మురళీకృష్ణ

- ప్రభుత్వ ఆదేశాల మేరకు బ్యాంకు రుణాలు
- బ్యాంకుబాట పట్టిన మండల వ్యవసాయాధికారులు
- సీసీఆర్‌సీ కార్డులున్న వారందరికీ రుణ సదుపాయం
- బ్యాంకు మేనేజర్లకు కౌలురైతుల జాబితా అందజేత

రాజాం సిటీ: కౌలురైతులందరికీ రుణాలు అందివ్వడమే లక్ష్యంగా మండల వ్యవసాయాధికారులు బ్యాంకుబాట పట్టారు. శుక్రవారం మండలంలోని పాగిరి ఏపీజీవీబీ(ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్) అధికారులను ఏవో రేణుకాసాయి కలిసి, మండలంలోని కౌలురైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు. అర్హులైన కౌలురైతులందరికీ పంట రుణాలు ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని, ఇందులో భాగంగానే ఈ నెల 27 వరకు కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించేందుకు బ్యాంకుల బాటపట్టామని తెలిపారు. మండలంలో 374 మంది కౌలురైతులు ఉన్నారని, వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ చర్యలతో ఎట్టకేలకు కౌలురైతులకు రుణాలు రానుండడంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రేగిడి: మండలంలోని అర్హులైన కౌలురైతులందరికీ బ్యాంకు రుణాలు అందించాలని ఏవో జి.మురళీకృష్ణ కోరారు. శుక్రవారం మండలంలోని ఉంగరాడమెట్ట ఏపీజీవీబీ, ఉనుకూరు ఏపీజీవీబీ, దేవుదళ ఎస్‌బీఐ, రేగిడి యూనియన్ బ్యాంకు మేనేజర్లను కలిసిన ఆయన వారికి కౌలురైతుల వివరాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా సీసీఆర్‌సీ కార్డులు పొందిన రైతులకు రుణాలు ఇవ్వాలన్నారు. మండలంలో మొత్తం 160 మంది రైతులకు ఆ కార్డులు ఇచ్చామన్నారు. రుణాలు ఇవ్వడం ద్వారా కౌలురైతులను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు.

వంగర: గ్రామాల్లోని కౌలురైతులకు రుణాలు అందించడమే లక్ష్యమని ఏవో తట్టికోట కన్నబాబు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యాంకుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని వంగర ఎస్‌బీఐ, అరసాడ ఏపీజీవీబీ బ్యాంకు బ్రాంచి మేనేజర్లతో మాట్లాడిన ఆయన కౌలురైతుల జాబితాలను వారికి అందించి, వారికి రుణాలు అందించాలని కోరారు.

డ్వాక్రా గ్రూపులో అవకతవకలు

- పొనుగుటివలసలో సభ్యుల ప్రమేయం లేకుండా రూ.10 లక్షల రుణం మంజూరు
- సొంతానికి వాడుకున్న ఆర్‌పీ
- బ్యాంకులో ఆరాతీస్తే బయటపడిన మోసం

రాజాం సిటీ: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామానికి చెందిన సిద్ధి వినాయక డ్వాక్రా గూపులో అవకతవకలు బయటపడ్డాయి. ఆర్‌పీ ఉమాదేవి ఏకంగా ఆ గ్రూపు నుంచి రూ.10 లక్షల రుణం వాడుకుని, సభ్యులను పక్కదారి పట్టించిన ఆమె మోసం ఎట్టకేలకు బయటపడింది. మెప్మా టీఎంసీ ఎస్‌వీ రత్నం, సీవో దానాలమ్మలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన సిద్ధి వినాయక డ్వాక్రా సంఘ సభ్యులు గతేడాది జనవరిలో లోన్ తీసుకున్నారు. వారికి రూ.3.30 లక్షలు రుణం మంజూరైంది. వాడుకున్న రుణాన్ని సక్రమంగా గ్రూపు సభ్యులు తీర్చుకుంటున్నారు. అంతవరకు బాగానే ఉన్నప్పటికీ తీసుకున్న రుణం ప్రతి నెలా సక్రమంగా చెల్లిస్తున్నా ఇంకా రుణం తీరకపోవడంతో బ్యాంకులో సభ్యులు ఆరాతీశారు. అప్పుడే అసలు విషయం బయటకు వచ్చింది. బ్యాంకుకు వెళ్లిన సభ్యులతో మీ గ్రూపు సభ్యులు ఇంకా రుణం చెల్లించాల్సి ఉందని, గతేడాది ఆగస్టులో రూ.10లక్షల రుణం తీసుకున్నారని బ్యాంకు అధికారులు వెల్లడించారు. దీంతో అవాక్కయిన గ్రూపు సభ్యులు ఆందోళన చెంది, మెప్మా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీవో దానాలమ్మ గ్రామానికి చేరుకుని, గ్రూపు సభ్యులతో సమావేశమై, పుస్తకాలు పరిశీలించారు.

సీసీఎల్ రూపంలో రుణం..

గతేడాది జనవరి 3వ తేదీన సభ్యులు తీసుకున్న రూ.3.30 లక్షల రుణం ప్రతినెలా సభ్యులు సక్రమంగా చెల్లిస్తున్న క్రమంలో రూ.లక్ష వరకు ఇంకా రుణం చెల్లించాల్సి ఉన్న సమయంలో దానిని ఆసరాగా తీసుకున్న ఆర్‌పీ ఉమాదేవి సీసీఎల్ (క్యాష్ క్రెడిట్ లోన్) రూపంలో గతేడాది ఆగస్టు 4వ తేదీన రూ.10 లక్షల రుణం గ్రూపు సభ్యుల పేరిట తీసుకుంది. ఆ మొత్తాన్ని గ్రూపు సభ్యులకు తెలియకుండా జాగ్రత్తపడుతూ తన సొంతానికి వాడుకుంది. రుణం సక్రమంగా కడుతున్నా ఇంకా తీరకపోవడంతో అనుమానం వచ్చిన సభ్యులు బ్యాంకుకు వెళ్లి ఆరాతీశారు. అప్పుడు అసలు విషయం బయటకు వచ్చింది. ఆర్‌పీ రూ.10 లక్షలు తీసుకున్నట్లు తెలుసుకుని అవాక్కయ్యారు. ఈ విషయం గ్రామంలో తెలియడంతో మరో గ్రూపులో సైతం అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. అయితే పూర్తిస్థాయిలో అన్ని గ్రూపులకు సంబంధించి, బ్యాంకు స్టేట్‌మెంట్‌లను పరిశీలిస్తే అసలు విషయం బయటపడుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. తీసుకున్న రుణం విషయం బయటకు చెప్పొద్దంటూ గత రెండు మూడు రోజులుగా మంతనాలు కూడా జరిపినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో మరో ఆర్‌పీ కూడా రూ.18 లక్షలను ఇదే తరహాలో వాడుకుని, మోసానికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని డ్వాక్రా సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



తెర్లాంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

తెర్లాం: మండల కేంద్రమైన తెర్లాంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చాలా చురుగ్గా జరుగుతోంది. శుక్రవారం తెర్లాం, పెరుమాళి పీహెచ్‌సీల సీహెచ్‌వోలు, ఎంపీహెచ్‌వోలు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలంతా కలిసి ఇంటింటికీ వెళ్లి, ప్రజల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలను నమోదు చేసుకున్నారు. తెర్లాంలో జరిగిన సర్వేలో పీహెచ్‌సీ సీహెచ్‌వో భాస్కరరావు మాట్లాడుతూ తెర్లాం గ్రామ సచివాలయ పరిధిలో అక్టోబర్ 6వ తేదీన వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు ఇవ్వనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి, ఏఎన్‌ఎంలు ప్రభావతి, ప్రశాంతి, హెల్త్ అసిస్టెంట్ గంగునాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు వై.శ్రీదేవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం



వార్డుల వారీగా పర్యటిస్తూ ప్రజాసమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

బొబ్బిలి: ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా వార్డుల వారీగా పర్యటిస్తున్న స్థానిక మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు దృష్టికి పలువురు తమ ప్రాంతంలోని రోడ్ల సమస్యలను తీసుకువచ్చారు. స్పందించిన ఆయన రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీఇచ్చారు. శుక్రవారం స్థానిక 15వ వార్డులోని మార్కెట్ రోడ్డు, గొల్లవీధి ప్రాంతాల్లో తిరుగాడిన ఆయన అక్కడి పారిశుద్ధ్య పరిస్థితులు, ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాదాపు మూడు దశాబ్దాలుగా రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వేస్తున్న రోడ్లతో సంతోషంగా ఉన్నారని, కొన్నిచోట్ల కూడా నిర్మాణాలు చేయాల్సి ఉందని వైస్ చైర్మన్ గొలగాని రమాదేవి తెలిపారు. త్వరలోనే మిగతా రోడ్లను కూడా నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శివప్రసాద్, ఏఈ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాకు ఆటంకం లేకుండా చర్యలు

- ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ

వంగర: తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ ద్వారా మండలంలోని ఆయకట్టు భూములకు సాగునీటి సరఫరాలో ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. కాలువ ఎగువభాగం పార్వతీపురం మన్యం జిల్లాలోని గరుగుబిల్లి మండలంలో ఉన్న గొట్టివలస సమీపంలో కాలువకు గండి కొట్టిన ప్రదేశాన్ని వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, ఆయకట్టు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఒక్కరోజులో గండి పూడ్చి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు స్వచ్ఛందంగా సొంత డబ్బులు వెచ్చిస్తున్నామని ఎంపీపీ వెల్లడించారు. ఆయకట్టు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. వివిధ గ్రామాల నుంచి రైతులు, రైతు కూలీలను తీసుకువెళ్లి, గండిని పూడ్చుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు యలకల శ్రీనివాసరావు, సాదెం శ్రీరామమూర్తి, యలకల వాసునాయుడు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



తోటపల్లి కాలువ వద్ద గండికొట్టిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ ఉమామహేశ్వరరావు

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



బొబ్బిలి: పౌష్టికాహార ప్రయోజనాలు వివరిస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

తెర్లాం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని స్థానిక వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, సచివాలయం–1 ఏఎన్‌ఎం ప్రశాంతి అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక ఐదో అంగన్‌వాడీ కేంద్రంలోని ప్రీస్కూల్ పిల్లలకు పౌష్టికాహార ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని లక్ష్మీపేట అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె.మంగమ్మ, కె.జయమ్మ, పి.మాలతిల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆహార పదార్థాల ప్రదర్శన చేపట్టారు.

బొబ్బిలి: మండలంలోని కొయ్యకొండవలస గ్రామంలో పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. సీడీపీవో విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంను గర్భిణులు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'స్వచ్ఛతా హి సేవా'

రాజాం: స్థానిక పట్టణంలోని వైఎస్సార్ పార్కుతో పాటు పలుచోట్ల స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎక్కడపడితే అక్కడ వ్యర్థాలు వేయకుండా పరిసరాల పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా అవసరమేనన్నారు. అనంతరం పార్కులోని చెరువులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించారు. కార్యక్రమంలో పట్టణ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, స్థానిక పట్టణంలోని డోలపేటలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన అర్బన్ పీహెచ్‌సీ భవనాన్ని మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు.



వైఎస్సార్ పార్కులో పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

24న పుస్తకావిష్కరణ

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 24వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) 104వ సమావేశం జరగనుందని రారవే నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ విద్యాపరిరక్షణ కమిటీ కన్వీనర్ డి.రమేష్ పట్నాయక్ రచించిన 'గతితార్కిక భౌతిక వాదం–ఒక పరిచయం', డేవిడ్ హార్వే 'పెట్టుబడి–ఏడు ప్రాథమిక వైరుధ్యాలు–పరిచయం మరియు ఇతర వ్యాసాలు' అనే రెండు పుస్తకాలను ఆవిష్కరించనున్నామన్నారు. రచయితతో పాటు అట్టాడ అప్పలనాయుడు, రౌతు గణపతి రావునాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని, రచయితలు, కవులు, భాషాభిమానులు, సాహిత్యాభిమానులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

గ్రామకంఠం విక్రయంపై విచారణ

బొబ్బిలి: పాతబొబ్బిలి పల్లెం వీధిలో సర్వే నంబర్ 265/2లోని ఎకరం గ్రామకంఠం భూమిని రెండుసార్లు విజయనగరం, బొబ్బిలిలోని వివిధ వ్యక్తుల పేరిట రిజిస్టర్ చేయించిన ఘటనపై కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ డోల రాజేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. ప్రాథమిక నిజనిర్ధారణ కోసం ఆర్ఐ కల్యాణ చక్రవర్తి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని నియమించారు. ఈ గ్రామకంఠం భూమిని బొబ్బిలికి చెందిన ఓ వ్యక్తికి రూ.2 కోట్లకు విక్రయించినట్లు అంబేడ్కర్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోరు సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు తహసీల్దార్ తెలిపారు. సమగ్ర దర్యాప్తు పూర్తయిన తర్వాత నివేదికను ఆర్‌డీవో, కలెక్టర్‌లకు అందజేస్తామన్నారు. అవకతవకలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

52 మంది టీడీపీ నేతల అరెస్ట్

బొబ్బిలి: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ ఆయనకు సంఘీభావంగా విశాఖలోని సింహాచలం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న 52 మంది టీడీపీ నేతలను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేశారు. పాదయాత్రకు వారు ఎటువంటి ముందస్తు అనుమతి తీసుకోలేదని, శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా వారిని అరెస్ట్ చేశామని సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపారు. అరెస్టయిన వారిలో టీడీపీ ఇన్‌చార్జ్ ఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు, ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, వాణిజ్య విభాగం జిల్లా నాయకులు సుంకరి సాయిరమేష్, జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు ఉన్నారు. అయితే వీరందరినీ సాయంత్రానికే విడిచిపెట్టారు.

రేజేరులో 'పొలంబడి'



రేగిడి: గుళ్లపాడులో బీజామృతంతో విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.శిరీష అధిక దిగుబడుల సాధనకు రైతులకు సలహాలు, సూచనలు చేశారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, రసాయనిక ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులను వినియోగించాలని తెలిపారు. కౌలురైతులకు కూడా పంట రుణాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అనంతరం రైతులకు లింగాకర్షక బుట్టలు, జిగురుపల్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ ఈశ్వరరావు.. స్థానిక ముగడ కాలనీలో ద్రవజీవామృతం తయారీని ప్రయోగాత్మకంగా శుక్రవారం వివరించి, దాని ప్రయోజనం వివరించారు.

రేగిడి: మండలంలోని గుళ్లపాడు గ్రామంలో విత్తనశుద్ధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్–2 అధికారి గౌరీశ్వరరావు మాట్లాడుతూ బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి, పొలంలో వేసుకుంటే పంటలు చీడపీడల బారినపడకుండా అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు.

రక్తదానం.. ప్రాణదానం..



రక్తదానం చేస్తున్న యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న రాజాం రెడ్‌క్రాస్ సభ్యులు

రాజాం సిటీ: రక్తదానం.. ప్రాణదానంతో సమానమని, విద్యార్థులు, యువత రక్తదానానికి ముందుకు రావాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక అమ్మవారి కాలనీలో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లేట్‌లెట్స్ తగ్గినప్పుడు, రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు, మహిళలు ప్రసవాల సమయంలో, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి రక్తం చాలా అవసరమన్నారు. అటువంటి వారికి ఆపద సమయంలో రక్తదానం చేస్తే వారి జీవితాన్ని నిలబెట్టినవారమవుతామన్నారు. మొత్తం 20 యూనిట్ల రక్తం సేకరించినట్లు ఆయన తెలిపారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, ఆర్నిపల్లి వెంకటనాయుడు, పి.గౌరీశ్వరరావు, బాబ్జి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

- తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి

తెర్లాం: హాస్టల్(వసతిగృహం)లో ఉంటున్న విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెర్లాం ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎస్సీ హాస్టల్(బాలురు)ను సందర్శించిన ఆమె అక్కడి విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. ఎంతమంది విద్యార్థులు ఉంటున్నారని, ప్రతిరోజూ వారికి మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా, లేదా అని వసతిగృహ సంక్షేమ అధికారి అప్పన్నను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విద్యార్థులు ఉండే గదులు, స్టాక్ రూమ్, సరుకుల నిల్వలు, హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులు బాగా చదివేందుకు, ఆరోగ్యంగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు చేయించాలని, పరిసరాల్లోని పిచ్చిమొక్కలు ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, చదువుపై ప్రత్యేక దృష్టిసారించాలని తెలిపారు. ఆమె వెంట పెరుమాళి ఎస్సీ వసతిగృహం సంక్షేమ అధికారి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



తెర్లాం ఎస్సీ హాస్టల్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

విద్యార్థులు మంచి అలవాట్లు అలవర్చుకోవాలి



రేగిడి: విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న వైద్యుడు సునీల్‌కుమార్

రేగిడి: బాల్యం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవాలని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం స్థానిక ఉంగరాడమెట్ట దగ్గరున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, కాసేపు మాట్లాడారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆయుర్వేద వైద్యం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు. మంచి ఆహారం తీసుకోవడంతో పాటు యోగాసనాలు, వ్యాయామం వంటివి చేయాలన్నారు. ఇక్కడి విద్యార్థుల్లో చాలామందికి ఐరన్ తక్కువగా ఉన్నట్లు గుర్తించామని, అలాంటి వారు ఎనిమీయా వ్యాధి బారినపడే అవకాశం ఉందని, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.సూర్యనారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వండానపేటలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో పలువురికి ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి రోహిణీ రాఘవ్ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనోత్సవాల్లో జాగ్రత్తలు పాటించాలి



రామభద్రపురం: కనిమెరక వీధిలో ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: వినాయక నిమజ్జనోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సీఐ తిరుమలరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాలను సందర్శించిన ఆయన గ్రామాల్లోని ఉత్సవ కమిటీలను కలిసి, పలు సలహాలు, సూచనలు చేశారు. పెద్దపెద్ద సౌండ్ బాక్సులతో ప్రజలకు ఇబ్బంది కలిగేలా వ్యవహరించకూడదన్నారు. విగ్రహాల ఊరేగింపు రోజు తప్పనిసరిగా పోలీసులకు తెలియజేయాలన్నారు. నిమజ్జనాలు చేసేటప్పుడు చెరువుల వద్ద అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికి ఏం జరిగినా ఉత్సవ నిర్వాహకులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, మండలంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో వినాయక నిమజ్జన కార్యక్రమం ఎంతో అట్టహాసంగా జరిగింది.